
## కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు..

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతల కిషన్



ఇందల్వాయి, బతుకమ్మ :కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలను కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా నిలిచినటువంటి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయడం సిగ్గుచేటు చేటని ఇందల్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తీర్మాన్ పల్లి సర్పంచ్ చింతల కిషన్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మంగళవారం రాత్రి మాట్లాడారు. ఢిల్లీలో పేపర్ లీకేజ్ పై విద్యార్థులు శాంతియుతంగా ధర్నా చేస్తున్న వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేసి విచక్షణ రహితంగా దాడి చేయడంపై కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ తదితరులు మద్దతుగా నిలిస్తే వారిని అరెస్ట్ చేయడం బిజెపి పార్టీ చేస్తున్న అరాచకంగా నిలిచిందన్నారు. తక్షణమే అరెస్ట్ చేసిన కాంగ్రెస్ పార్టీ అధినేతలను బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని యెడల మండల జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళనలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దాం

### మోరిల్ శ్రీనివాస్ రావు



బాన్సువాడ, బతుకమ్మ :బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనాతో పాటు పార్టీలో చేరిన ప్రతి బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు అని మోరిల్ శ్రీనివాస్ రావు తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసేవ లక్ష్యాలతో ముందుకు సాగుతూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు అందరం సమిష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.రాబోయే రోజుల్లో పార్టీ అభివృద్ధి కోసం గ్రామస్థాయి నుంచి మరింత బలంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ మరోసారి అభినందనలు తెలియజేస్తూ, పార్టీ విజయానికి అందరి సహకారం అవసరమని మోరిల్ శ్రీనివాస్ రావు పేర్కొన్నారు.ఈ సమావేశంలో మాజీ జడ్పిటిసి నార్ల రత్నకుమార్, జిల్లా మాజీ రైతు బంధు అధ్యక్షులు దుద్దాల అంజిరెడ్డి, కౌన్సిలర్ మాక్బూల్ తదితరులు ఉన్నారు.

## ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

### ఎస్ఐ వినయ్



నందిపేట్, బతుకమ్మ :మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. నందిపేట్ మండల కేంద్రంలో మంగళవారం ఎస్ఐ వినయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన సుమారు 20 మంది వాహనదారులకు మొత్తం రూ.4,000 జరిమానాలు విధించారు. అదే విధంగా వాహనాలపై పెండింగ్‌లో ఉన్న చలానాలను 11 మంది వాహనదారుల నుంచి మొత్తం రూ.1,450 వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని ఆయన కోరారు.

# రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు అందించాలి

### ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ, అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి ఆయన వ్యవసాయ, నీటి పారుదల, ఆర్.డబ్ల్యూ.ఎస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల వారీగా పంటల సాగు వివరాలు, తాగునీటి సరఫరా తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ రైతులు ఏ రకం పంటలు వేశారన్నది పరిశీలించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఇంకనూ పంట విత్తుకోని రైతులు తక్కువ నీటి అవసరం అయ్యే ఆరుతడి పంటలు, ఆకు కూరలు, పందిరి కూరగాయల సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని అన్నారు. వర్షాభావ పరిస్థితుల




గురించి ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని, తేమ నీటితో సాగయ్యే పంటల గురించి వారికి తెలియజేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ సాగు ఎంతో మేలు అని, ఈ దిశగా రైతులు ముందుకు వచ్చేలా చూడాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 6500 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు అవుతోందని, ఈ సంవత్సరం మరో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగు జరిగేలా లక్ష్యం మేరకు కృషి చేయాలని అన్నారు. వివిధ రకాల పంటల సాగు కోసం అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. నేల స్వభావాన్ని బట్టి అనుకూలమైన పంటలు వేసుకునేందుకు వీలుగా భూసార పరీక్షలు జరిపించి, వాటి వివరాలు రైతులకు తెలుపాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలని హితవు పలికారు. అదే విధంగా జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సరఫరాకు ఇబ్బంది తలెత్తకుండా ముందస్తుగానే కార్యాచరణ ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ఆయా జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించాలని, నీటి వృథా జరగకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

### టీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంబ్లే గోపాల్




జుక్కల్, బతుకమ్మ :పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టిటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంబ్లే గోపాల్ అన్నారు. ఈ మేరకు ఆగస్టు 23న నిర్వహించనున్న జనజాగరణ యాత్ర పోస్టర్లను మంగళవారం జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. టిటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు హన్మంత్ రెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోస్టర్లను ఆవిష్కరించి, హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 52 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ, డీఏలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తిరుపతయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుంకరి శ్రీనివాస్, వై. జనార్ధన్, కే.సాయిలు, జైచంద్, సునీల్, సంతోష్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో ప్రభుత్వ గ్రంథాలయం ఎప్పుడొస్తుంది..?

గ్రంథాలయం లేక చదువుకు ఇబ్బందులు

ఎదుర్కొంటున్న నిరుద్యోగులు

ప్రభుత్వ గ్రంథాలయం కోసం నిరుద్యోగ యువత ఎదురుచూపులు

గ్రంథాలయం లేక చదువుకు తీవ్ర ఆటంకం

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా

బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలో ప్రభుత్వ గ్రంథాలయం లేకపోవడంతో నిరుద్యోగ యువత, విద్యార్థులు చదువుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోటీ పరీక్షలు, ఉద్యోగ నియామక పరీక్షలు, గ్రూప్స్, డీఎస్సీ, బ్యాంకింగ్, రైల్వే, పోలీస్ తదితర పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు.ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు ఇళ్లలో స్థలాభావం, విద్యుత్ అంతరాయాలు, కుటుంబ పరిస్థితుల కారణంగా ఏకాగ్రతతో చదవలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర పట్టణాలకు వెళ్లి గ్రంథాలయాల్లో చదవాల్సి రావడంతో అదనపు ఖర్చు, సమయ నష్టం కూడా ఎదురవుతోందని తెలిపారు.ప్రభుత్వ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు, ప్రతిపక్ష నాయకులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ వంటి అభివృద్ధి చెందుతున్న పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి, చదువుకునేందుకు ప్రత్యేక రీడింగ్ హాల్, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, డిజిటల్ లైబ్రరీ, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు కల్పించాలని నిరుద్యోగ యువత ప్రభుత్వాన్ని కోరుతోంది. దీనివల్ల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వేలాది మంది విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరడంతో పాటు విద్యా అభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి నివేదిక సమర్పించిన టీఆర్ఎస్ చీఫ్

ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు సంబంధించి భారత ప్రభుత్వం అమలు చేస్తున్న స్వతంత్రత సైనిక్ సమ్మాన్ యోజనతో పాటు హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ కు సంబంధించిన నిబంధనలను కమిటీ అధ్యయనం చేయాలని సూచించారు. ఆ నమూనాలను ఆధారంగా తీసుకుని తెలంగాణ ఉద్యమకారులకు కూడా ప్రయోజనాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో తాను ఉద్యమకారులతో భుజం భుజం కలిపి పనిచేశానని, గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయాన్ని పార్టీ అంతర్గత వేదికల్లో ప్రస్తావిస్తూ వారి కోసం పోరాడిన వ్యక్తిని తానేనని కవిత పేర్కొన్నారు. ఆ పోరాటం కారణంగానే బీఆర్ఎస్‌లో తాను రాజకీయంగా నష్టపోయానని అన్నారు. తన సూచనల వల్ల ఉద్యమకారులకు కొంతైనా మేలు జరిగితే అదే తన జీవితానికి సార్థకతగా భావిస్తానని తెలిపారు. తెలంగాణ అమరవీరులకు, ఉద్యమకారులకు నివాళులర్పించిన ఆమె, ఉద్యమంలో ఉన్న భావోద్వేగ అంశాలను చట్టబద్ధమైన నిబంధనలుగా మార్చే బాధ్యత కమిటీపై ఉందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపులో అనుసరించిన విధానాలను ఆదర్శంగా తీసుకుని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను రూపొందించాలని సూచించారు. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని తప్పనిసరిగా గుర్తించాలని, సాయుధ రైతాంగ పోరాటానికి సంబంధించి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలతో ప్రయోజనాలు కల్పించిన విషయాన్ని కమిటీ పరిశీలించాలని కోరారు. ఉద్యమంలో పనిచేసిన వివిధ సంఘాలు, సంస్థల సిఫార్సులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. జాగృతి సంస్థ వద్ద వేలాది మంది ఉద్యమకారుల వివరాలు ఉన్నాయని, కమిటీ కోరితే పూర్తి వివరాలు, ఆధార్ కార్డులు, సంప్రదింపు వివరాలు అందజేస్తామని తెలిపారు. ఉద్యమంలో జైలు శిక్ష అనుభవించిన వారు, ఎఫ్ఐఆర్‌లు, ఛార్జిషీట్లు నమోదైన వారిని ప్రాధాన్యంతో గుర్తించాలని కవిత సూచించారు. అలాగే మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని, అండర్‌గ్రౌండ్‌లో పనిచేసిన వారు, హౌస్ అరెస్టుకు గురైన వారు, ఆస్తి నష్టం, శారీరక వైకల్యం, పోలీసు దౌర్జన్యాలకు గురైన వారిని కూడా గుర్తింపు పరిధిలోకి తీసుకురావాలని కోరారు. లాఠీచార్జీల్లో తీవ్రంగా గాయపడిన వారు, ఉద్యమం కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన వారు, ప్రభుత్వ చర్యలతో జీవనోపాధి దెబ్బతిన్న వారిపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కమిటీని కోరారు. ఉద్యమకారులు మరణించిన సందర్భాల్లో వారి కుటుంబ సభ్యులకు---భార్య, పిల్లలు లేదా తల్లిదండ్రులకు---ప్రాధాన్యంగా ప్రయోజనాలు అందేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో అవకతవకలకు తావులేకుండా పారదర్శక వ్యవస్థను రూపొందించాలని, సహ ఖైదీలు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, విద్యావంతుల వేదికల ద్వారా కూడా ధ్రువీకరణ చేపట్టాలని ప్రతిపాదించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు 30 నెలల తర్వాత కమిటీ ఏర్పాటు కావడం విచారకరమని కవిత వ్యాఖ్యానించారు. ఉద్యమకారులు పలుమార్లు ఆందోళనలు చేసిన తర్వాతే ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా, అధికారంలోకి వచ్చిన తేదీ నుంచే ఉద్యమకారులకు అన్ని ప్రయోజనాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జార్ఖండ్‌లో ఉద్యమకారుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని, అక్కడ మాదిరిగానే తెలంగాణలో కూడా శాశ్వత కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. గోవా, దాద్రా నగర్ హవేలి, బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉద్యమకారుల సంక్షేమ పథకాలను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అమలు చేయాలని కోరారు. “కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ప్రజల్లో ఉంది. ఆ అభిప్రాయాన్ని ఈ కమిటీ తప్పని నిరూపించాలి. నిర్దిష్ట గడువులో ఉద్యమకారులను గుర్తించి, వారికి అందించే ప్రయోజనాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి” అని కవిత విజ్ఞప్తి చేశారు.